
ప్రజాశక్తి



పారా అథ్లెటిక్స్‌లో జిల్లాకు మూడో స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నంలో జరిగిన పారా ఆరో రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విజయనగరం జిల్లా మూడో స్థానం సాధించింది. 22 కేటగిరీల్లో 37 ఈవెంట్లు నిర్వహించగా, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 350 మంది పారా క్రీడాకారులు పాల్గొన్నారు. గతం కంటే పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు సత్తాచాటారు. వీరిని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారి వివరాలు త్వరలో విడుదల చేస్తారని చెప్పారు.



జెండాను ఎగురవేస్తున్న శివానందకుమార్

- అశాస్త్రీయంగా ఎవరు ప్రవర్తించినా సమాజానికి చేటు
- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎం.గేయానంద్
- రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని పిలుపు
- వైభవంగా జెవివి జిల్లా మహాసభ

తీవ్ర సంక్షోభంలో విద్య, వైద్యం



జెవివి జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు ఎం.గేయానంద్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విద్య, వైద్య రంగాలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఎం.గేయానంద్ ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ, సాంస్కృతిక రంగాలు సైతం తీవ్ర ఒడిదొడుకుల్లో ఉన్నాయని చెప్పారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభను జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు అధ్యక్షతన వైభవంగా నిర్వహించారు. ముందుగా జాతీయ జెండాను జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు శివానంద కుమార్, జెవివి జెండాను మరో గౌరవాధ్యక్షులు జె.నీలయ్య ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభలో గేయానంద్ ప్రసంగించారు. జాతీయంగా అమానవీయమైన సంఘటనలు, ఉద్రిక్త పరిస్థితులు ఉన్నాయని, వీటిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టంచేశారు. అశాస్త్రీయంగా ఎవరు ప్రవర్తించినా సమాజానికి చేటేనని వ్యాఖ్యానించారు. వీటన్నింటిపై సెప్టెంబర్ 13, 14వ తేదిల్లో విజయనగరంలో జరిగే రాష్ట్ర మహాసభ చర్చించి.. భవిష్యత్తు కార్యాచరణకు నిర్దేశం చేస్తుందన్నారు. కళలకు కాణాచిగా నిలయంగా ఉన్న విజయనగరంలో రాష్ట్ర మహాసభ జరగడం మంచి పరిణామన్నారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకట్రావు మాట్లాడుతూ సత్యాల సమాహారమైన సైన్స్‌ని మనం భుజాన్ని వేసుకుని, మంచి కోసం పని చేయాలన్నారు. శాస్త్రీయమైన భావజాలం సమాజానికి మేలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఒక చారిత్రాత్మకమైన సంఘటన అయిన 1994లో సారా ఉద్యమం చేపట్టిన రోజుల్లో విజయనగరం జిల్లాలో నాలుగో రాష్ట్ర మహాసభ నిర్వహించామని గుర్తుచేశారు. 18వ రాష్ట్ర మహాసభను విజయ నగరం జిల్లాలో మరోసారి నిర్వహించనున్నామని చెప్పారు. జెవివి మరింత బలం పుంజుకోవడానికి ప్రయత్నించాలని పిలుపునిచ్చారు.

జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, గోపాలరావు, గిరిధర్ మాట్లాడుతూ ఎన్నికలను అపహాస్యం చేసే విధంగా ఎన్నికల కమిషన్, కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రవర్తిస్తున్నాయని విమర్శించారు. పార్లమెంటు ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పిలవకపోవడం వారి మూఢత్వానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఎందరో ప్రాణత్యాగాలతో నిర్మించిన విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్థిక దోపిడీ విచ్చలవిడిగా జరుగుతోందని చెప్పారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, సమాజానికి నష్టాన్ని కలిగించే వాటి మీద మాత్రమే జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. జిల్లాలో ఉన్న 27 మండలాల్లో సైన్స్ ఉద్యమాన్ని విస్తరించాలన్నారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు చీకటి దివాకర్ మాట్లాడుతూ తాత్విక ఆలోచన దిశగా జన విజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. సమావేశంలో జెవివి ప్రధానకార్యదర్శి రమణ ప్రభాత్, సమతా విభాగం రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల, జిల్లా యూత్ కన్వీనర్ చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిగా వెంకటరావు, రమణ ప్రభాత్

జనవిజ్ఞానవేదిక జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 34 మందితో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా గౌరవాధ్యక్షులుగా కె.శివానందకుమార్, జె.నీలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా కె.మురళీబాబు, కోశాధికారిగా సిహెచ్.సింహాచలం ఎన్నికయ్యారు.



ఎంవిఎన్ వెంకటరావు



రమణ ప్రభాత్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విద్యాశాఖలో అవినీతిపై

గవర్నర్‌కు లేఖ రాశారా?

మాజీ మంత్రి బొత్సకు మంత్రి కొండపల్లి ప్రశ్న

ప్రజాశక్తి-విజయనగరంకోట

గత ప్రభుత్వంలో విద్యా శాఖలో ఎన్నో అవినీతి ఆరోపణలు ఉన్నాయని, వాటిపై ఎప్పుడైనా విచారణ చేయాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గవర్నర్‌కు లేఖ రాశారా? అని చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఎప్పుడైనా ముందుకొచ్చి మాట్లాడారా? అని నిలదీశారు. స్పీకర్ తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ కోసం గవర్నర్‌కు లేఖ రాశారంటే ఆయనకున్న నిబద్ధత ఎంతో గుర్తు పెట్టుకోవాలన్నారు. దీన్ని వక్రీకరించి ప్రతిపక్షంలో ఉన్నవారు మాట్లాడడం సరికాదని బొత్సకు హితవుపలికారు. సిఎం చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు తీసుకు రావాలని ప్రయత్నిస్తున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చేలా బాటలు వేస్తున్నారన్నారు. దీనికి ఆటంకం కలిగిస్తూ, పారిశ్రామిక వేత్తలను భయభ్రాంతులకు గురి చేసేలా మాజీ సిఎం జగన్ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ సిఎం చంద్రబాబును చూసి వైసిపి అధినేత జగన్ బుద్ధితెచ్చుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధిని టిడిపి ఎప్పుడూ అడ్డుకోలేదన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పనిచేస్తామంటే టిడిపి ఎప్పుడూ అడ్డుకోలేదని, అయినా జగన్ ఏమీ చేయలేక పోయారని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి భోగాపురం, గంట్యాడ మండలాల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, కొండపల్లి భాస్కర్‌రావు, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సంతోష్ పాల్గొన్నారు.

బొత్స పారదర్శకతను నిరూపించుకోవాలి : నాగార్జున

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ స్వచ్ఛందంగా పారదర్శకతను నిరూపించుకోవాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే, జగనన్న విద్యాకానుక కింద దాదాపు 7 లక్షల అదనపు సామగ్రిని కొనుగోలు చేశారని తెలిపారు. అదనపు సామగ్రిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఏమిటని, రూ.150 కోట్లకు పైగా ప్రజాధనాన్ని వృథా చేశారని ఆరోపించారు. 1600 చట్టవిరుద్ధమైన బదిలీలు చేయడానికి ఉపాధ్యాయుల నుంచి రూ.5 లక్షల నుంచి 7 లక్షలు చొప్పున వసూలు చేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయని తెలిపారు. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లపై అనేక ఆరోపణలు వచ్చాయని చెప్పారు. వీటిపై అప్పటి విద్యా శాఖ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ.. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విచారణ కోరి, పారదర్శకతను నిరూపించు కోవాలని హితవుపలికారు.



యుటిఎఫ్ జెండావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక జెడ్‌పి కార్యాలయ ప్రాంగణంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర నాయకులు డి.రాము ఆవిష్కరించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ తిరుపతి నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు జెఆర్‌సి పట్నాయక్, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, ఆర్‌ఎవి సూర్యారావు, జి.రాజారావు, ఎన్.సత్యనారాయణ, ఎ.శంకర్రావు, మున్సిపాలిటీ సబ్ కమిటీ కన్వీనర్ ఎస్.వెంకట్రావు, జిల్లా అకడమిక్ కన్వీనర్ జి.గంగాధర్ రావు, జిల్లా నాయకులు జి నిర్మల పాల్గొన్నారు.

రాత్రివేళల్లో ప్రత్యేకంగా గస్తీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలో రాత్రివేళల్లో ప్రత్యేకంగా గస్తీ నిర్వహిస్తున్నామని, సరైన కారణం లేకుండా అర్ధరాత్రుళ్ల బహిరంగంగా తిరిగితే కేసులు తప్పవని ఎస్‌పి వకుల్ జిందల్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇందుకుగాను సిఐ స్థాయి అధికారి పర్యవేక్షణలో ప్రతి రోజూ ప్రత్యేకంగా రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు కొన్ని కఠిన నిర్ణయాలు తప్పవని, అందుకు అనుగుణంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నగరంలో రైల్వే స్టేషను, ఆర్‌టిసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతు బజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, విటి అగ్రహారం, బొబ్బిలి మున్సిపాలిటీ, నెల్లిమర్ల, రాజాం నగర పంచాయతీల్లోని కొన్ని ముఖ్య ప్రాంతాల్లోనూ పోలీసులు ప్రతిరోజూ తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. రాత్రి 11 గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసి వేసే విధంగా చర్యలు తీసుకొంటున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, సహేతుకరమైన కారణాలు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా వారిపై టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, వారిని పోలీసుస్టేషనుకు తరలించి, వారి తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు కారణాలు లేకుండా రాత్రి 11 గంటల తరువాత సంచరించే వారిపై జిల్లా వ్యాప్తంగా 3,573 కేసులు నమోదు చేశామని వివరించారు.

అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరాయే లక్ష్యం

ఇపిడిసిఎల్ రూరల్ ఇఇ సురేష్ బాబు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విజయనగరం రూరల్ పరిధిలో ప్రజలకు, రైతులకు, పరిశ్రమలకు అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్ ను అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఎపిఇపిడిసిఎల్ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్ బాబు తెలిపారు. శనివారం తనను కలసిన ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలో పూసపాటిరేగ, నెల్లిమర్ల, రాజాం, భోగాపురం, డెంకాడ, కొత్తవలస మండలంలోని విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఆటంకాలూ లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రానున్న కాలంలో కూడా విద్యుత్ సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఇప్పటికే కొత్తవలస దగ్గర ఉన్న అద్దన్నపాలెంలో 33/11 కెవి సబ్‌స్టేషన్ మూడు కోట్లతో ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. పెదతాడివద్ద మరో మూడు కోట్ల నిధులతో 33/11 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. ప్రధానంగా సముద్ర తీర ప్రాంతమైన భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పాడైన విద్యుత్ స్తంభాలు, వైర్లు, ఆర్మ్స్, క్రాస్‌లు పనులు జరుగుతున్నా యన్నారు. ఇప్పటి వరకు మొత్తం రూరల్ డివిజన్‌లో 2024-25లో 258 పనులను, రూ.1445.89 లక్షలతో చేపట్టినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన పిఎం సూర్యఘర్ పథకానికి ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే 24 గంటలు అందుబాటులో ఉండే 1912 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ ద్వారా పిర్యాదు చేయాలని, సిబ్బంది సేవలు అందించేందుకు సిద్ధంగా అందుబాటులో ఉంటారని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు, పంట పొలంలోకి వెళ్లే రైతులు విద్యుత్ మీటర్లు, స్విచ్ బోర్డులు వద్ద, స్థంభాలు వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

శ్రమపడ్డారు.. సాధించారు

- పోలీసు ఉద్యోగాల్లో సత్తాచాటుతున్న పాతబగ్గాం యువత
- ఒకేసారి ఐదుగురికి ఉద్యోగాలు
- ఇప్పటివరకు 15 మందికి కొలువులు

'కలలు కనండి.. వాటిని సాకారం చేసుకునేందుకు కృషి చేయండి' అన్నారు.. భారతరత్న ఎపిజె అబ్దుల్ కలామ్. ఆ మార్గదర్శి చెప్పింది నూటికి నూరుపాళ్లు వాస్తవం. కలల్ని కనడమే కాదు, వాటిని సాకారం చేసుకోవాలంటే సరైన కార్యాచరణ, పట్టుదల అవసరం. ఆ కృషి లేకుంటే ఆ కల నీరుగారిపోతుంది. కలగానే మిగిలిపోతుంది. ఈ విషయాన్ని అవపోషణ పట్టారేమో ఆ ఊరి యువత!. లక్ష్యానికి అనుగుణంగా శ్రమపడుతున్నారు. పోలీసు నోటిఫికేషన్ వచ్చిన ప్రతిసారీ సత్తాచాటుతున్నారు. ఈసారి ఏకంగా ఐదు పోస్టులు సాధించి, పోలీసు నోటిఫికేషన్‌లో తమకు తిరుగులేదని నిరూపించారు. ఆ గ్రామమే.. గజపతినగరం మండలంలోని పాతబగ్గాం.

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

ఇటీవల విడుదల చేసిన పోలీసు కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో గజపతినగరం మండలం పాతబగ్గాం యువకులు ఐదుగురు సత్తాచాటారు. దీంతో ఆ గ్రామం పేరు జిల్లాలో మరోసారి మారుమోగింది. పోలీసు నోటిఫికేషన్ వచ్చిన ప్రతిసారీ ఆ గ్రామం నుంచి యువత ఉద్యోగాలు సాధిస్తూనే ఉన్నారు. ఈసారి కాస్త ప్రత్యేకత ఏమిటంటే? ఐదుగురు యువకులూ ఒకే గదిలో చదువుకుని, సాధన చేసి, కొలువులు సాధించడం. గ్రామంలో భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచారు.

పోలీస్ శాఖలో పాతబగ్గాం గ్రామానికి ప్రత్యేక అనుబంధం ఉంది. 2009లో ఇద్దరు, 2011లో ఒకరు, 2012లో ముగ్గురు, 2018లో ఒకరు ఉద్యోగాలు సాధించారు. 2022లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఒకరు ఎంపికయ్యారు. గతంలో మరో ఇద్దరు ఉద్యోగాలు సాధించారు. ఈ నెల ఒకటో తేదిన విడుదలైన కానిస్టేబుల్ ఫలితాలలో ఏకంగా ఐదుగురు ఉద్యోగాలు సాధించారు. మొత్తం ఒకే గ్రామంలో 15 మంది పోలీస్ శాఖలో ఉద్యోగాలు చేయడంతో మిగతా గ్రామాల యువతకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఇటీవల పోలీసు కొలువులు సాధించిన యువకుల అభిప్రాయాలను 'ప్రజాశక్తి' సేకరించింది.



పాతబగ్గాం గ్రామం


పోలీసు కావడమే కల



గతంలో ప్రయివేట్ కంపెనీలో పనిచేశాను. 2022లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ రావడంతో కంపెనీలో ఉద్యోగానికి రాజీనామా చేశాను. పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా కలలు కన్నాను. నేడు ఆ కల నిజం కావడం ఎంతో సంతోషంగా ఉంది. చిత్తూరు జిల్లాలో ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను.

\- సంగంరెడ్డి హేమంత్ కుమార్


పోలీసు అంటే ప్యాషన్



పోలీసు ఉద్యోగమంటే ఎంతో ఇష్టం. గత నాలుగు సంవత్సరాలుగా నా ఇష్టాన్ని తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంలో కీలక పాత్ర పోషించారు. దీంతో రాజమండ్రిలో ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించాను.

\- సంగంరెడ్డి గణేష్

పోలీసు ఉద్యోగమే ఊపిరి



డిగ్రీ పూర్తి చేసి పోలీస్ ఉద్యోగమే ఊపిరిగా భావించి గత ఐదేళ్లుగా సాధన చేశాను. ఐదుగురం ఒకే గదిలో చదువుతూ, అద్దె కడుతూ మేము పడిన కష్టానికి ఫలితం లభించింది. విజయనగరం జిల్లాలో సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

\- తగరంపూడి పవన్ కళ్యాణ్

వారే స్ఫూర్తి



2017లో డిగ్రీ పూర్తి చేశాను. అప్పటి నుంచి మా ఊరిలో అప్పటికే పోలీసు ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారి నుంచి స్ఫూర్తి పొందాను. పోలీస్ శాఖపై మక్కువ పెరిగింది. ఈ తరుణంలో రెండో ప్రయత్నంలో విజయనగరం సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాను.

\- కుమిలి ధనంజయ

అమ్మ కష్టం



గత మూడు సంవత్సరాలుగా మా అమ్మ ఎంతో కష్టపడి, నన్ను చదివించించారు. నేడు ఆ కష్టానికి తగినట్లు ప్రభుత్వ ఉద్యోగం లభించింది. ప్రకాశం జిల్లాలో ఎపిఎస్‌పి కానిస్టేబుల్‌గా ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉంది.

\- కడమల దినేష్ కుమార్


'స్త్రీశక్తి'కి 137 బస్సులు



- రోజుకు 25 వేల మంది మహిళలు ప్రయాణించే అవకాశం
- ఐదు రకాల బస్సుల్లో అనుమతి
- ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపిస్తే చాలు
- 'ప్రజాశక్తి'తో జిల్లా ప్రజా రవాణా అధికారి జి.వరలక్ష్మి ముఖాముఖి

ప్రజాశక్తి-విజయనగరంకోట

'ప్రజా రవాణా వ్యవస్థలో ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంతో కీలకం. నిరంతరం ప్రజలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి చేరవేయడంలో ఆర్‌టిసి పాత్ర మహోన్నతం. వేల సంఖ్యలో ప్రయాణికులను రోజూ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేస్తోంది. ఇప్పుడు ఆర్‌టిసి ముందున్న మరో సవాల్ మహిళలకు ఉచిత ప్రయాణం. దీనికి సంబంధించి స్త్రీ శక్తి పథకానికి 137 బస్సులు జిల్లాలో కేటాయించాం. ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా మహిళలు ప్రయాణించొచ్చు' అని జిల్లా ప్రజా రవాణా అధికారి గుడివాడ వరలక్ష్మి ప్రకటించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



జిల్లా పరిధిలో ఎన్ని రూట్లు? ఎన్ని సర్వీసులు ఉన్నాయి.?

జిల్లాలోని శృంగవరపుకోట డిపోలో 54, విజయనగరం డిపోల పరిధిలో 123... మొత్తం 177 బస్సులు ఉన్నాయి. జిల్లాలోని విజయనగరం డిపో పరిధిలో 47, శృంగవరపుకోట పరిధిలో 13 రూట్లు... మొత్తంగా 60 రూట్లలో ఆర్‌టిసి బస్సులు నిరంతరం ప్రయాణిస్తున్నాయి. విజయనగరం డిపో పరిధిలో రోజుకు 46,489 కిలోమీటర్లు, ఎస్.కోట డిపో పరిధిలో 16,384 కిలోమీటర్లు మొత్తంగా 62,843 కిలోమీటర్లు మేర రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం విజయనగరం డిపోలో 131 సర్వీసులు, శృంగవరపుకోట డిపోలో 47 సర్వీసులు నడుపుతున్నాం.

జిల్లాలో ఎన్ని ప్రభుత్వ, ప్రయివేటు బస్సులు ఉన్నాయి.?

జిల్లాలో 123 ప్రభుత్వ బస్సులు ఉన్నాయి. మిగిలిన 54 బస్సులు ప్రయివేటువి. జిల్లాలో పల్లెవెలుగు 108, అల్ట్రా పల్లెవెలుగు 7, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 14, ఎక్స్‌ప్రెస్‌లు 8 బస్సులు ఉన్నాయి. అల్ట్రా డీలక్స్ 20, సూపర్‌లగ్జరీ 5 బస్సులు ఉన్నాయి. ఇవి కాకుండా గ్యారేజీలో కొన్ని బస్సులకు మరమ్మతులు చేస్తున్నాం. ప్రస్తుతానికి జిల్లాకు ఎలక్ట్రికల్ బస్సులు రావట్లేదు.

బడి బస్సులు ఎన్ని సర్వీసులు, ఎన్ని రూట్లలో నడుపుతున్నారు.?

జిల్లాలో విద్యార్థులు బడి బస్సుల్లో అధిక సంఖ్యలో ప్రయాణిస్తున్నారు. 9 బస్సులు ఏడు రూట్లలో ప్రయాణిస్తున్నాయి. ఇందులో విజయనగరం డిపోలో ఐదు బస్సులు, శృంగవరపుకోట డిపో నుంచి నాలుగు బస్సులను ప్రతిరోజూ నడుపుతున్నాం. సుమారు 1200 మంది విద్యార్థులు బడిబస్సుల్లో ప్రయాణిస్తున్నారు.

ఒఆర్ ఎక్కువ అందిస్తున్న మార్గాలేవి.?

జిల్లాలో రెండు డిపోల నుంచి సింహాచలం, విశాఖపట్నం, అనకాపల్లి, చీపురుపల్లి, పార్వతీపురం మార్గాల్లో ఆక్యుపెన్సీ రేషియో (ఒఆర్) ఎక్కువ వస్తోంది. విజయనగరం నుంచి ఆంధ్ర, తిప్పలవలస, కొండగంగ్రేడు, ఊటపల్లి, శృంగవరపుకోట నుంచి అరకు, గాతాడ మార్గాల్లో ఆక్యుపెన్సీ రేషియో తక్కువగా ఉంటోంది.

స్త్రీశక్తి పథకానికి ఎన్ని బస్సులు కేటాయిస్తున్నారు.? ఎంతమందికి లబ్ధి చేకూరే అవకాశముంది.?

జిల్లాలో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి స్త్రీశక్తి పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకానికి జిల్లాలోని రెండు డిపోల పరిధిలో 127 బస్సులు అందుబాటులో ఉంచుతున్నాం. ప్రస్తుతం జిల్లాలో మహిళా ప్రయాణికుల సంఖ్య 12 వేల వరకు ఉంటోంది. ఉచిత బస్సు ప్రయాణం అమలైతే వీరి సంఖ్య 25 వేల వరకు పెరిగే అవకాశముంది.

స్త్రీశక్తి పథకానికి మార్గదర్శకాలు ఏమిటి.?

స్త్రీ శక్తి పథకంలో ప్రభుత్వం ఐదు రకాల బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిచ్చింది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణించేందుకు అవకాశం కల్పించింది. జిల్లాలో 137 బస్సులు.. అంటే, పల్లెవెలుగు 108, అల్ట్రా పల్లెవెలుగు 7, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 14, ఎక్స్‌ప్రెస్‌లు 8 బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆధార్, ఓటరుకార్డు, రేషన్‌కార్డు చూపించి రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించొచ్చు. ఈ నెల 15వ తేది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది.

బస్సుల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులేమైనా వచ్చాయా.?

బస్సుల మరమ్మతులకు ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఎటువంటి నిధులూ రాలేదు. సంస్థాగతంగా ఆర్‌టిసిని బలోపేతం చేసుకుంటూ నిధులను మేము సమకూర్చుకోవడం ద్వారా మరమ్మతులు చేస్తున్నాం.

డిపోల్లో సిబ్బంది కొరత ఏమైనా ఉందా.?

జిల్లా వ్యాప్తంగా ఉన్న రెండు ఆర్‌టిసి డిపోల్లో సిబ్బంది కొరత ఉంది. అందులో ప్రధానంగా డ్రైవర్లు, కండక్టర్ల పోస్టులకు గాను డ్రైవర్లను ఆన్‌కాలర్ ద్వారా నెట్టుకొస్తున్నాం. కండక్టర్లను సర్దుబాటు చేస్తున్నాం. గ్యారేజీ విషయానికొస్తే ఎక్కువగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారు.



రక్తదానం చేస్తున్న యువత

రక్తదాన శిబిరం విజయవంతం

ప్రజాశక్తి- గజపతినగరం రూరల్

మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం సహాయస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ మాట్లాడుతూ 'రక్తదానం... జీవన దానం' అనే నినాదంతో యువత ముందుకు రావాలని ఉద్దేశంతో ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో 25 మంది రక్తం సేకరించామన్నారు. ప్రతి మూడు నెలలకు రక్తదానం చేయడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. అనారోగ్య బారిన పడినవారికి, రోడ్డు ప్రమాదాలు అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తికి రక్తం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రసాద్, అజయ్, రూపేష్, ఆశిక్, మణికంఠ, శ్యామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కెజిపూడి, పికెఆర్‌పురం గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని చేపడతామని వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతారని, ఎంపిపి, జెడ్‌పిటిసి, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కృష్ణంనాయుడును పరామర్శిస్తున్న బొత్స సత్యనారాయణ, శ్రీనివాసరావు

మాజీ ఎంపిపికి బొత్స పరామర్శ

ప్రజాశక్తి- గరివిడి

గరివిడి మాజీ ఎంపిపి కొనిసి కృష్ణంనాయుడు వారం రోజుల క్రితం గుండెపోటుకు గురై విజయనగరం మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఇంటికి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం కృష్ణంనాయుడు స్వగృహం గెడ్డపువలసలో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వీరితో పాటు గరివిడి ఎంపిపి విశ్వేశ్వరరావు, చీపురుపల్లి వైసిపి మండల నాయకులు అనంత్, వరహాలనాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు కృష్ణంనాయుడును పరామర్శించారు.



మాట్లాడుతున్న జెసి రాజు

చేనేత వస్త్రాలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీహరి, శివకాంత్ ఆధ్వర్యంలో కళింగవైశ్య భవనంలో నిర్వహిస్తున్న చేనేత వస్త్ర మేళలో చేనేత వస్త్రాలు కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా రోటరీ జిల్లా అధ్యక్షులు జె సి రాజు మాట్లాడుతూ రోటరీ సభ్యులు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయటం ద్వారా చేనేత కార్మికులకు చేయూత నిచ్చారన్నారు.సుమారు రూ. 60వేలు విలువ చేసే వివిధ రకాల చేనేత ఉత్పత్తులను, దుస్తులను రోటరీ సభ్యులు కొనుగోలు చేశారన్నారు. వారంలో ఒకరోజు చేనేత దుస్తులను ధరించేలా రోటరీ సభ్యులు సంకల్పించాలని రాజు కోరారు. ఈ కార్యక్రమంలో గెంబలి శ్రీనివాసరావు, నితీష్, రామకృష్ణ, పివిఎ మెర్సీ బాయ్, అనురాధ, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కొండకరకాంలో కార్డాన్ సెర్చ్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం మండలంలోని కొండకరకాం గ్రామంలో రూరల్ సిఐ బి. లక్ష్మణరావు ఆధ్వర్యాన ఆదివారం కార్డాన్ సెర్చ్ చేపట్టారు. పోలీసులు బృందాలుగా ఏర్పడి, ఇంటింటికీ వెళ్లి నాటు తుపాకీలు, గంజాయి, ఇతర నిషేధిత వస్తువులపై సోదాలు చేశారు. ఎక్కడా ఇవి లభించలేదని ఆయన తెలిపారు. లైసెన్సు లేకుండా ఆయుధాలు కలిగి ఉండడం చట్టరీత్యా నేరమని, ఎవరి వద్దనైనా అనుమతులు లేకుండా ఆయుధాలు లభిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ బృందాలకు విజయనగరం రూరల్ ఎస్ఐ వి.అశోక్ కుమార్, గంట్యాడ ఎస్ఐ డి.సాయికృష్ణ, పిఎస్ఐ నాని నాయకత్వం వహించారు.



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

ఎపిసిపిఎస్ఇఎ జిల్లా అధ్యక్షులుగా రమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిసిపిఎస్ఇఎ జిల్లా అధ్యక్షులుగా వెంపడాపు రమణ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక శ్రీనివాస జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి గురాన శ్రీనివాసరావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ ఒకటో తేదిన చేపట్టే చలో విజయవాడ కార్యక్రమం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మొయ్యి శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి- బొబ్బిలి

ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుందామని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ అన్నారు. మండల కేంద్రంలో యుటియఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, విద్యా రంగ రక్షణ కోసం యుటియఫ్ నిరంతరం పోరాడుతుందని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రభుత్వ విద్యా రంగ రక్షణ కోసం నిరంతరంగా పోరాడుతుందని తెలిపారు. నేడు విద్యా రంగంలో బోధనేతర పనుల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తున్నారని ఉపాధ్యాయుడు ఏ పని చేసినా అంతిమ లక్ష్యం విద్యార్థి కావాలి తప్ప సమాచార సేకరణ కాదని ఇకనైనా ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. అనంతరం యుటియఫ్ జెండాను సీనియర్ నాయకులు ఎన్. అజయకుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి కేశవరావు, మన్యం జిల్లా కార్యదర్శులు శంకర రావు, రామకృష్ణ, బొబ్బిలి డివిజన్ నాయకులు సత్యనారాయణ, శశిభూషణ రావు, వెంకటరావు, చంటి, బి.రమేష్, సుధాకరరావు, శంకరరావు, పోలినాయుడు, అనంత్, శివప్రసాదరావు, ఎల్. శ్రీనివాసరావు, సత్యనారాయణ, వి.శంకరరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: జెండా వందనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గరివిడి: గరివిడి యుటిఎఫ్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను యుటిఎఫ్ రాష్ట్ర భాద్యులు ఎ.సత్య శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు ఎ.సత్యశ్రీనివాసు, జిల్లా గౌరవ అధ్యక్షులు మీసాల అప్పలనాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాద్యులు గొర్లె పద్మావతి, జిల్లా కార్యదర్శి ఎం.రఘునాథరాజు, చీపురుపల్లి భాద్యులు ఎన్ బలరాం, డి.కృష్ణమూర్తి, మామిడి శ్రీనుభూపతి, జిల్లా భాద్యులు బి. రాజశేఖర్, బి.బంగార్రాజు, గరివిడి భాద్యులు వరప్రసాద్, సంధ్య, ఐక్య సత్యనారాయణ, గోపి, త్రినాధ్ ఎంటిఎస్ టీచర్ జెఎస్ఎన్ తదితరులు పాల్గొన్నారు.



గరివిడి: జెండా వందనం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి

కూటమితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- విజయనగరం కోట

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. ఆదివారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా 27, 28వ డివిజన్లలోని రాజీవ్ నగర్ కొలనీ, ఆంజనేయ స్వామి కోవెల ప్రాంతంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, నాయకులు గంటా పోలి నాయుడు, రమణ, టి. రామారావు, ఎస్. పైడ్రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసుకు సర్వర్ సమస్య

ప్రజాశక్తి- వేపాడ

మండల కేంద్రంలోని ప్రధాన పోస్టల్ కార్యాలయం పరిధిలో ఎనిమిది బ్రాంచ్ పోస్టు ఆఫీసులు పనిచేస్తున్నాయి. వీటిలో సుమారు నెల రోజులుగా సర్వర్ పనిచేయకపోవడంతో కనీసం రిజిస్టర్ పోస్టు కూడా చేయలేని పరిస్థితి ఉంది. సర్వర పని చేయక సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా లేక కార్యాలయానికి వచ్చే వినియోగదారులు అడిగిన ప్రశ్నలకు సిబ్బంది సరైన సమాధానం చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు విద్యుత్తు అంతరాయం కలిగితే పూర్తిగా పనులు నిలిచిపోతున్నాయని, గతంలో జనరేటర్ సదుపాయం ఉండేదని ఇప్పుడు అది కూడా లేకపోవడంతో ఏ పనీ చేయలేకపోతున్నామని పోస్టుమాస్టర్ జి తాతారావు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సర్వర్ సమస్య ఉన్నందున రిజిస్టర్ పోస్ట్ చేయాలని వచ్చే వారికి తామేమీ సమాధానం చెప్పలేకపోతున్నామని సకాలంలో సేవలు అందించలేక నెల రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.



సర్వర్ పనిచేయని వేపాడ పోస్టు ఆఫీసు ఇదే..

ఘనంగా బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండల కేంద్రంలోని ఎపి ఆదర్శ పాఠశాల ప్రాంగణంలో ఆదివారం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ పోటీలో అండర్ 16 విభాగం నుంచి పదిమంది బాలికలు, పదిమంది బాలురు, అండర్ 19 విభాగం నుంచి పదిమంది బాలికలు, పదిమంది బాలురు, సీనియర్ల విభాగంలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఎంపికైనట్టు తెలిపారు. జిల్లా టీమ్ నుంచి ఎంపిక చేసిన 30 మందిని ఈ నెల 29, 30,31, తేదీల్లో ప్రకాశం జిల్లాలో ఆడనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని ఆయన అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ దేశానికి వెన్నెముక విద్యార్థులేనని అన్నారు. బాలురు బాలికలు ఈ పోటీలో పాల్గొని మన రాష్ట్రానికి పేరు తేవాలని కోరారు. ఈ క్రమంలో తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. ఇలాంటి క్రీడల్లో పాల్గొని పథకాలు తెచ్చి తల్లిదండ్రులకు మన రాష్ట్రానికి మంచి పేరు తెచ్చి రాబోయే రోజుల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ సిహెచ్ మల్లు నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు పుట్టా శ్రీనివాసరావు, టిడిపి మండల యువత అధ్యక్షులు శ్రీనాథ్ రాజేష్, అసోసియేషన్ సెక్రెటరీ జి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన రెల్లివలసకు చెందిన కనకం కుటుంబాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాద బీమా కింద ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును వైద్య ఖర్చులు నిమిత్తం రూ.71,900 బాధిత కుటుంబానికి అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజల ఆరోగ్యం, సంతోషం తమకు ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం పంచాయతీ పరిధిలోని వీధులను పరిశీలించి గ్రామస్థుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ఆరు నెలల క్రితం చేసిన పరిశీలనలో ఇచ్చిన సూచనల మేరకు ఇప్పుడు వీధులు పరిశుభ్రంగా ఉండడం, మురుగునీరు లేకపోవడం పట్ల సర్పంచ్ అప్పలరాజును అభినందించారు. రైతుల పెట్టుబడి సాయం, పింఛన్లు వంటి సంక్షేమ పథకాలు చాలా వరకు అందలేదని గ్రామస్థులు తెలియజేయడంతో, పెండింగ్‌లో ఉన్న అర్హులందరికీ త్వరితగతిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు, కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, తెదేపా నాయకుడు ఈశ్వరరావు, చల్లవాని తోట సర్పంచ్ ప్రతినిధి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

వారధితో విద్యార్థులకు వేదన

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని వాల్తేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వారధి శాపంగా మారింది. అంగన్వాడి, ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ బ్రిడ్జి దాటి వెళ్ళాలి. సుమారు 10 గ్రామాల విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వచ్చి చదువుతున్నారు. అయితే ఈ బ్రిడ్జి కనీసం రక్షణ గోడ లేకపోవడంతో భయాందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ కావడంతో సాయన్న గెడ్డ నుండి పంటపొలాలకు పిల్లకాలువ నీరు ఈ బ్రిడ్జి క్రింద నుండే ప్రవహిస్తుంది. కాలువ పాఠశాలకు ఆనుకొని ఉండడంతో చిన్నారులు, విద్యార్థులు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందేమోనని భయాందోళన చెందుతున్నారు. తల్లిదండ్రులు అంగన్వాడి చిన్నారులను, ప్రాథమిక పాఠశాల విద్యార్థులను దగ్గరుండి నేరుగా పాఠశాలకు తీసుకువస్తున్నారు. మార్కండేయస్వామి, సంతోషిమాత ఆలయాలకు వెళ్ళే భక్తులు ఈ బ్రిడ్జి దాటి వెళ్లాల్సిందే. ఈ బ్రిడ్జికి సుమారు 30ఏళ్ళు పూర్తి కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. అయితే నిత్యం విద్యార్థులు, భక్తులతో బిజీగా ఉన్న ఈ బ్రిడ్జిను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టాలని తల్లిదండ్రులు, విద్యార్థులు, భక్తులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



బెంచీని వితరణగా అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఉదారత

ఆరు సిమెంట్ బెంచీలు అందజేత

ప్రజాశక్తి - గజపతినగరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు దవలపల్లి మోహన్‌దాస్, దవలపల్లి శివరంజన్‌దాస్ అన్నదమ్ములు ఇద్దరు తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. తమ తండ్రి దవలపల్లి సీతారామయ్య, ఇతర కుటుంబ సభ్యులు జ్ఞాపకార్థం రూ.18 వేలు విలువ చేసే ఆరు సిమెంట్ బెంచీలు స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్ కుమార్‌కు ఆదివారం అందజేశారు. ఈ బెంచీలను పాఠశాల ఆవరణంలోని మైదానం చుట్టూ ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల ప్రాంగణానికి మరింత అందం వచ్చింది. ఈ బెంచీల ఏర్పాటు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో దాత శివరంజన్ దాస్‌తో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీరు అందించండి

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని బొద్దూరు, బిల్లానీ, తలతంపర, పొనుగుటివలస, గుల్లసీతారంపురం, ఎస్.రంగరాయపురం గ్రామాలకు తోటపల్లి రిజర్వాయర్ నుండి సాగునీరు అందించాలని జలవనరుల శాఖ అధికారులను నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు వల్లూరు గణేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం రేగిడి మండలం తాటిపాడు వద్ద సాగునీటి కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ మండలంలోని చివరి గ్రామాలకు సాగునీరు అందించాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. పంట పొలాల్లో నీరు లేక వరినారు ఎండిపోతున్నాయని తెలిపారు. తక్షణమే సాగునీరు విడుదల చేయాలని ఔఇ కె.రఘును కోరారు. ఈ కార్యక్రమంలో వల్లూరు అప్పారావు, ప్రభాకరరావు పాల్గొన్నారు.



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న నాయకులు

పరిధి దాటి వైద్యం చేయరాదు

ప్రజాశక్తి- పార్వతీపురం

గ్రామీణ వైద్యులు పరిధి దాటి వైద్యం చేయరాదని, ప్రభుత్వ నిబంధనలను అనుసరించాలని ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ అధ్యక్షులు జంగం జోషి, ప్రధాన కార్యదర్శి గెద్ద చిరంజీవి అన్నారు. ఆర్ఎంపి, పిఎంపిలు పై జరుగుతున్న తనిఖీలపై మన్యం జిల్లాలో గ్రామీణ వైద్యులు ఐక్యవేదిక ఆదివారం స్థానిక పింఛనదారుల భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగీ, ఆబార్షన్ వంటి కార్యక్రమాలను ఆర్ఎంపిలు చేయరాదని చెప్పారు. తనిఖీలకు వచ్చే అధికారులతో సామరస్యంగా వ్యవహరిస్తూ వారిని గౌరవించాలని సూచించారు. 2009లో కమ్యూనిటీ పారామెడిక్స్ శిక్షణ పొంది ఉన్నవారు చాలామంది జిల్లాలో ఉన్నారని కొత్తవారుతో తెలిసి తెలియని వైద్యం చేయడం వల్ల ఒకరి తప్పు అందరిపై పడుతుందని దీనినీ నివారించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఐక్య వేదిక నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక పిఎంపి అధ్యక్షులు సింహాచలం, కార్యదర్శి ఎన్ గోపాలనాయుడు, పాలకొండ ఐఆర్ఎంపిడబ్ల్యు రామినాయుడు, సాలూరు ఇంచార్జ్ నరేష్, విజయనగరం జిల్లా అధ్యక్షులు కోట్ల పైడిరాజు, జిఎల్‌పురం గౌతం రవికుమార్, జిల్లాలో ఉండే సుమారు 200 మంది పైగా సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గెద్ద చిరంజీవి

నేరాలు ఘోరాలు

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య

ప్రజాశక్తి- డెంకాడ(భోగాపురం)

భోగాపురం మండలంలోని ముక్కాం గ్రామానికి చెందిన గనగల రామచంద్రుడు (28) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. రామచంద్రుడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తు తాగుడికి బానిసై నిత్యం అదే పని మీద ఉండేవాడు. శనివారం సాయంత్రం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యను మద్యం తాగడానికి మరలా డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు లేవు ఇవ్వను నిత్యం ఇదేపని నీకు అని మందలించింది. దీంతో రామచంద్రుడు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కి ఉరేసుకున్నాడు. బయట అత్త మరదలతో మాట్లాడుతున్న భార్య శబ్దం విని ఇంటిలోపలకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని కాలు చేతులు తన్నుకుంటూ కిందపడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న భర్తను విజయనగరం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి ఏడేళ్ల క్రితం అదే మండలం కొండరాజు పాలెం గ్రామానికి చెందిన ఎల్మాజితో పెళ్లయింది వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

మండలంలోని పారాది వంతెన సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో రామభద్రపురం మండలం వంగపండువలసకు చెందిన ఆల్తి లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డారు. తన కుమార్తెను ఆసుపత్రికి తీసుకుని వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో గాయపడ్డరు. లక్ష్మణరావును అంబులెన్స్‌తో బొబ్బిలి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.



గాయపడిన లక్ష్మణరావు

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్‌టియు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం నగరంలోని యూత్ హాస్టల్లో ఎస్‌టియు జిల్లా ముఖ్య నాయకుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కె.జోగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జోగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 14 నెలలు కావస్తున్న రాష్ట్రంలో ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను ఇంత వరకు ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. తక్షణమే పిఆర్‌సి కమిషనర్‌ని నియమించి, ఐఆర్‌ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్‌టియు నాయకులు సిహెచ్ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జోగారావు

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి - కంటోన్మెంట్

విజయనగరం మండలంలోని పాత దుప్పాడ గ్రామంలో పాము కాటుకు గురై మహిళ ఆదివారం మృతి చెందింది. వన్ టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. పాత దుప్పాడ గ్రామానికి చెందిన టి.సత్యవతి (43) శనివారం సాయంత్రం పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త నర్సింగరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం వన్ టౌన్ ఎస్ఐ దేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన సత్యవతి